59 అర్జీలను స్వీకరించిన రాధికా గుప్తా



సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించిన 59 అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తా స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డితో కలిసి ప్రజా ఫిర్యాదులను అందుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడిగా రాము



గాదె రామును అభినందిస్తున్న దృశ్యం

కీసర: ఆర్యవైశ్య సంఘం దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడిగా గాదె రాము ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం దమ్మాయిగూడ సిద్ధార్థ నగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆర్యవైశ్య సంఘం దమ్మాయిగూడ శాఖ సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్ రావు, కరుణాకర్, పూర్ణచందర్, రాజా నాగేంద్ర, కోశాధికారిగా వినేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మంచాల చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా టి. రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్‌కుమార్, సలహాదారులుగా శ్రీనివాస్, నాగరాజ్, కార్యవర్గ సభ్యులుగా శివకుమార్, విజయ్‌కుమార్‌గుప్తా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వాల వైస్ చైర్మన్ వాస కిరణ్‌కుమార్, జిల్లా పీఆర్‌ఓ కమిటీ చైర్మన్ రేణిగుంట మహేష్‌కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సంతోష్, జిల్లా కార్యవర్గసభ్యులు టి. రమేష్ గుప్తా పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ రఘునాథ్‌కు సత్కారం



డీఎంహెచ్‌ఓ రఘునాథ్‌ను సన్మానిస్తున్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ తదితరులు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామికి అరుదైన గౌరవం దక్కింది. వైద్య రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు నగరంలో ప్రముఖ ఆరోగ్య సంస్థల సంఘం, తెలంగాణ హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన వార్షిక సమావేశంలో ఆయనను తానా సత్కారంతో ఘనంగా సన్మానించారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్: రవీంద్ర నాయక్‌తో పాటు పలువురు రాష్ట్ర స్థాయి వైద్యాధికారులు పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లాలో పలు ఆరోగ్య కార్యకలాపాల తోపాటు ఆరోగ్య సంరక్షణ, మెరుగైన వైద్య సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావడంలో డీఎంహెచ్‌ఓ రఘునాథ్ స్వామి చేసిన కృషికి తానా సత్కారం నిదర్శమని పలువురు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డా: టి.రఘునాథ్ స్వామి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటంలో మెడికల్ సిబ్బంది సహకారం ఎంతోగానో ఉందని, వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ వర్కర్లకు రూ.10 వేలు ఇవ్వాలి



సాక్షి,సిటీబ్యూరో: సమగ్ర కులగణనలో భాగంగా ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న ఆశవర్కర్లకు పారితోషకం ఇవ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కల్యాణి, జిల్లా నాయకురాళ్లు వాసంతి హేమలత, అనురాధ, ప్రవీణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ హరిప్రియ, డీఎంహెచ్‌ఓ డాక్టరు రఘునాథ్ స్వామికి వేర్వేరుగా వారు వినతిపత్రాలు అందజేశారు. సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఆశ వర్కర్లకు రూ.10వేల చొప్పున చెల్లించాలని కోరారు. ఆశ వర్కర్లు స్థానికంగానే సర్వే చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించి అన్నీ సేవా కార్యక్రమాలకు ఆశ వర్కర్లను వినియోగించుకుంటున్న సర్కారు వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఆశవర్కర్ల ఆరోగ్య సమస్యలపై కూడా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ జిల్లా నాయకుడు ఉన్నికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వసతులు



తాగునీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మెరుగైన వసతులు కల్పిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, చైతన్యనగర్‌లోని డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద 6 బ్లాక్‌లకు తాగునీటి సరఫరాను స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ ఇళ్ల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఐక్యంగా ఉండి సమస్యలను సాధించుకోవాలన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని డబుల్ ఇళ్ల వద్ద వసతులు కల్పించేలా చొరవ చూపుతామన్నారు. మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మునుగంటి రాంప్రదీప్, భూపతి రామచంద్రం, అరుణకుమారి, అనిత, సీతామహాలక్ష్మి, వెంకటేష్, జాన్, సుధాకర్, సుబ్రమణ్యం, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం మెరుగు



అల్వాల్: క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం మెరుగవుతుందని లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కె.సదానంద్ అన్నారు. ఓల్డ్ అల్వాల్‌లోని లిటిల్ ఫ్లవర్‌స్కూల్‌లో లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థలు ఓల్డ్ అల్వాల్, టెంపుల్ అల్వాల్, వెంకటాపురం శాఖలకు క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కె.సదానంద్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడుతాయన్నారు. తమ విద్యాసంస్థలు పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడలపైన ఆసక్తిని పెంపొందించడం కోసం క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఓల్డ్ అల్వాల్ సీనియర్స్ విభాగం, టెంపుల్ అల్వాల్ జూనియర్స్ విభాగంలో విజయం సాధించారు. అనంతరం వారికి పతకాలను అందజేసి ప్రశంసించారు. డైరెక్టర్ కె.శరత్‌చంద్ర భార్గవ్, వైస్ ప్రిన్సిపల్ శివలిరాయ్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, క్రీడాశిక్షణ ఉపాధ్యాయులు ప్రకాష్, స్పందన, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణితో సత్వర పరిష్కారం



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న మేయర్ అమర్‌సింగ్



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న వాసవీ ఎన్‌క్లేవ్ కాలనీ సభ్యులు

కాప్రా: ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం సర్కిల్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణి నుంచి వచ్చిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 4 దరఖాస్తులు రాగా.. అందులో టౌన్ ప్లానింగ్‌కు సంబంధించినవి 2, శానిటేషన్, రెవెన్యూకు సంబంధించి ఒక్కో దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదు పత్రాలను స్వీకరించారు. 15 దరఖాస్తులు అందాయని మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రజల నుంచి అందే వినతిపత్రాలను సత్వరమే పరిష్కరించేలా ముందుకుసాగాలని మేయర్ అమర్‌సింగ్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి..

అల్వాల్: అల్వాల్ వాసవీ ఎన్‌క్లేవ్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అల్వాల్ సర్కిల్ ప్రజావాణిలో డీసీ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం కాలనీ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. వాసవీ ఎన్‌క్లేవ్ కాలనీలోకి వచ్చే వరదను అరికట్టాలని, అదే విధంగా కాలనీలోని గ్రామకంఠం రహదారి పశువుల ఆసుపత్రి వెనుక భాగంలో పలువురు ప్లాట్లు చేసి గృహ నిర్మాణం చేస్తున్నారని, వెంటనే ఆ నిర్మాణాలను ఆపాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎన్‌క్లేవ్ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు పెద్ది రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కీసర: నాగారం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బండ్లగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు. బండ్లగూడ, విరాట్‌కాలనీ, ఠాకూర్ కాలనీ, శ్రీరామ్‌నగర్, మోడీ అపార్ట్‌మెంట్, కేఎస్‌ఆర్‌టౌన్‌షిప్, అరుందరతికాలనీ, ప్రజా సాయిగార్డెన్ రోడ్డు, రామకృష్ణనగర్, సంతోష్‌నగర్, ఐకాం కంపెనీ, లక్ష్మీనగర్, వీకర్ సెక్షన్ కాలనీల్లో అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని, విద్యుత్ ఏఈ మురళి తెలిపారు.

ప్రేమ పెళ్లికి నిరాకరించిందని..

తల్లిపై తనయుడి దాడి

ఘట్‌కేసర్: ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకునేందుకు తల్లి ఒప్పుకోకపోవడంతో ఆమెపై కుమారుడు దాడి చేసిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక బాలాజీనగర్‌కు చెందిన నాగమణి తన కుమారులు శివ సాయికిరణ్‌తో కలిసి నివాసం ఉంటోంది. ఓ యువతిని ప్రేమించిన సాయికిరణ్ ఆమెను ప్రేమ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు నాగమణి అంగీకరించకపోవడంతో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మద్యం తాగి ఇంటికి వచ్చిన సాయికిరణ్ తల్లిపై రాయితో దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం..అంబేడ్కర్‌నగర్ మహంకాళి అమ్మవారి ఆలయం సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి (35–40) మృతదేహం పడి ఉందని స్థానికులు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారించగా వ్యక్తి వివరాలు తెలియలేదు. పంచానామ అనంతరం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు వికలాంగుడు, యాచకుడిగా భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పవర్‌బోర్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

నీటి ఎద్దడిని తీరుస్తాం..

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో నీటి ఎద్దడిని తీరుస్తామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధి ఉప్పరిగూడ సంజయ్‌గాంధీనగర్‌లో పవర్‌బోర్‌ను ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇంటింటికి నల్లా ద్వారా నీరు వస్తున్నప్పటికీ కొన్నిచోట్ల నీటి ఎద్దడి ఉంటుందని, తమ ప్రాంతంలో పవర్‌బోర్ల ద్వారా నీటి సరఫరా జరిగేలా చూస్తామన్నారు. డివిజన్ అధ్యక్షుడు ఉమేష్‌సింగ్, మధుగౌడ్, కిషోర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో పార్కింగ్ ఫీజు వసూలుపై నిరసన



నాగోల్ మెట్రో పార్కింగ్ వద్ద నిరసనలో ప్రజా సంఘాలు

ఉప్పల్: మెట్రోస్టేషన్లలో బహిరంగంగా పార్కింగ్ ఫీజు వసూలుకు నిరసనగా యువజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సోమవారం నాగోల్ మెట్రో పార్కింగ్ స్థలం వద్ద చేపట్టిన నిరసనలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్. ప్రదీప్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌లు హాజరై మాట్లాడుతూ.. మెట్రో పార్కింగ్ స్టేషన్లలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే ఫీజులు వసూలుచేయడం సరికాదన్నారు. ప్రభుత్వ స్థలంలో ఉచిత పార్కింగ్ వసతి కల్పించిన మెట్రో, ఎల్అండ్‌టీ సంస్థ నేడు అక్రమార్జనకు తెరతీసిందని వారు దుయ్యబట్టారు. నగరంలోని అన్ని మెట్రోస్టేషన్లలో పార్కింగ్ ఫీజుల వసూలు చేయడాన్ని ఎత్తివేయాలని, అన్ని మెట్రోపార్కింగ్ స్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. వాహనాల పరిరక్షణ బాధ్యత ఫీజులు వసూలు చేసే సంస్థ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎం. రవికుమార్, బీఎస్. కృష్ణ, నవీన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాప్రా: సాకేత్ కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలపై స్థానికులు కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం సాకేత్ శ్రీయుగ ఎన్‌క్లేవ్, రామ్‌దాస్ కాలనీ, సీఎస్‌నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ స్థానిక సమస్యలపై కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు, పార్క్ సుందరీకరణ, తాగునీటి సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఏఎస్‌రావు విజ్ఞానోత్సవాలు





ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కాప్రా: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో చేపట్టిన డాక్టర్ ఏఎస్‌రావు విజ్ఞానోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సెప్టెంబర్ 20న ప్రారంభమైన ఈ విజ్ఞానోత్సవాలు నవంబర్ 4తో ముగిశాయి. ముగింపు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. పేద విద్యార్థులు మంచి ర్యాంకులు తెచ్చుకుని ఉన్నత విద్య కోసం డబ్బులు లేక ఇబ్బందులు పడితే తాను పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. పేదలకు వైద్య సహకారం కావాలన్నా తనవంతు సహాయం అందిస్తానన్నారు. కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, మాజీ కౌన్సిలర్ చల్లా లీలావతి, యాదగిరి రావు, రాఘవరెడ్డి, రమేష్, గిరీష్, రహీం, గగన్‌కుమార్, నారాయణరావు, శివరామకృష్ణ, సీఎస్‌రావు, రుక్కయ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి సోమవారం పూజలు



ఘట్‌కేసర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఘట్‌కేసర్: కార్తీక మాసం మొదటి సోమవారం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లింగాలకుంట సయ్యంభూ నాగలింగేశ్వర స్వామి ఆలయం, శివారెడ్డిగూడ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పత్రి, విభూతి, తులసి దండలు, పంచామృతంతో అర్చనలు, అభిషేకాలు చేశారు. తులసి కోటలు, ఆలయ ధ్వజస్తంభం ఎదుట కార్తీక మాసం దీపాలు వెలిగించారు. ఆలయ పూజారి శ్రీ కృష్ణ పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

అభినందనలు



ఎస్‌జీఎఫ్ విజేతలతో పీడీ లక్ష్మి

ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 43వ జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలలో ఎదులాబాద్ జెడ్పీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈసీఐఎల్‌లో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో మొదటి, రెండో స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయ బృందం విజేతలను, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మిని సోమవారం అభినందించారు.

అయ్యప్ప పడిపూజకు రూ.2 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: తత్వమసి సేవా సమాజం వారి ఆధ్వర్యంలో నవంబర్ 30న ధర్మ శాస్త్ర అయ్యప్ప సమాజం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 18 పడుల పడిపూజా మహోత్సవానికి నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, గురుస్వాములు రామిడి మల్లారెడ్డి, ఘనపురం వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దె ప్రాతిపదికన మున్సిపల్ షాపు కేటాయింపు



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్పలో అందుబాటులో ఉన్న మున్సిపల్ షాపును వేలం ద్వారా లబ్ధిదారునికి అద్దె ప్రాతిపదికన సోమవారం కేటాయించారు. అత్యధికంగా నెలకు రూ.5300 అద్దె చెల్లించే విధంగా పోతురాజు సుధాకర్ వేలంలో పాడుకొని షాపును దక్కించుకున్నారు. చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది వేలం నిర్వహించారు.

కులగణనపై శిక్షణ

కాప్రా: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కులగణన ఈనెల 6 నుంచి ప్రారంభం కానుంది. దీనిలో భాగంగా సర్వేకు సంబంధించి ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సోమవారం ఏఎస్‌రావునగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ మాట్లాడుతూ.. సర్వే లక్ష్యాలు, విధివిధానాలు, కార్యాచరణ గురించి వివరించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో వైకుంఠధామం నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీతాప్రవీణ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వైకుంఠధామం నిర్మాణ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆధునిక సాంకేతికతతో నిర్మిస్తున్నందున కాంట్రాక్టర్లు, అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం చేసినా సహించేది లేదన్నారు. త్వరలోనే శ్మశానవాటికను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. శంకుస్థాపన జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి చేతుల మీదుగా జరగనున్నట్లు కార్పొరేటర్ వివరించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

మల్కాజిగిరి: కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల కోసం రూపొందించిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆల్ ఇండియా ప్రధానమంత్రి యోజన కమిటీ ప్రధాన కార్యదర్శి రామ్‌నాథ్ కోరి అన్నారు. మల్కాజిగిరి ఎస్ఎస్‌కే ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యం మీద ఎక్కువ దృష్టి సారించిందన్నారు. తక్కువ మొత్తంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య, బీమా పథకాలను తీసుకొచ్చిందన్నారు. వ్యాపారులకు ముద్రలోన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా సొంతిల్లు పొందడానికి అవకాశం ఉందన్నారు. ఇటీవల వృద్ధులకు రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందొచ్చన్నారు. ప్రధాని నాయకత్వాన్ని బలపరిచేందుకు ఎక్కువ మొత్తంలో బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహించాలని ప్రజలు కూడా సభ్యత్వ నమోదులో పాల్గొనాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సత్యంగౌడ్, కిరణ్, శ్రీనివాస్, రుత్విక్, రామక్రిష్ణ, బాలచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కుషాయిగూడ: ఎల్రక్టికల్ విభాగం చర్లపల్లి డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న నర్సింగరావు మరణవార్త తెలిసిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆయన భౌతికదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు.